

# ప్రేమ జల్లు కురిసింది

-ఎ.శ్రీనివాసరావు

నాకే చాలా ఆశ్చర్యంగా ఉంది... నేనేమిటీ ప్రేమలో పడడం ఏమిటి?

అసలు ఇది ప్రేమించే వయసేనా? ఎవరికైనా తెలిస్తే 'ఎంత ఘాటు ప్రేమయో... ఇంత లేటు వయసులో' అనుకోరూ?

అవును మరి నా కష్టాలు మామూలు కష్టాలా? అంతులేని కథ చిత్రంలో జయప్రద కష్టాలు కావూ?

బరువుబాధ్యతల పేరుతో తన పైవారినీ, కిందివారినీ ఓ ఇంటివార్ని చేయడానికి ఇలా కరిగిపోవాల్సి వచ్చింది.

నాకే కనుక చాలామంది అమ్మాయిల్లాగే ఇరవై ఏళ్లకే పెళ్లయి ఉంటే ఈపాటికి పెళ్లీడువచ్చిన కూతురు ఉండేది ఈ వయసులో!

అసలు ఇంతటికీ కారణం ఆ బాబ్జీయే కదూ? అతను ఈమధ్యే పరిచయం అయ్యాడు. అదేం చిత్రమో అతని కథా నాలాంటి కథే. అంతే కాదు అన్నివిధాలా ఈడూజోడూ!

"మీకు నచ్చితే మనం ఒక్కటి కావచ్చు"

అతని ప్రపోజల్ గుర్తుకువచ్చినప్పుడల్లా గుండెల్లో ఏదో తెలియని గుబులు. అలా అని అది బాధ కాదు...అదోరకమైన చిత్రాతిచిత్రమైన అనుభూతి. ఆలోచించి నిర్ణయం చెప్పమన్నాడు.

ఎంత తీవిగా అడిగాడు! అవును మరి...నచ్చాడు కదా ఎలా అడిగినా బాగానే అన్పిస్తాడు.

అందునా గత పదిరోజుల్నుంచి ఫోనులో గంటలు గంటలు అతని గొంతులో ధ్వనించే ప్రేమ తరంగాలలో తేలిపోతున్నాను.

అందుకే ఎందుకో నిన్న ఆ ప్రపోజల్ పెట్టగానే "ఓ వారంరోజులు నాతో మాట్లాడకుండా, నాకు కనిపించకుండా ఉండండి. అప్పుడు ఆలోచిస్తా" అన్నాను.

తమాషాగా అన్న ఆ మాటల్ని అతను సీరియస్‌గా తీసుకున్నట్లున్నాడు.

"సరే ప్రయత్నిస్తా" అంటూ గిర్రున తిరిగి వెళ్లిపోయాడు.

ఇది జరిగి పదహారు గంటలు కావస్తోంది. నిజంగానే అతను సీరియస్‌గా తీసుకున్నట్లున్నాడు. చిరాగ్గా వున్న నన్ను నా సెల్‌ఫోన్ జాలిగా చూస్తున్నట్లు అనిపించింది. సాధారణంగా ఉదయం తొమ్మిది గంటలకు అతని నుంచి ఫోన్ వస్తుంది. కానీ ఇప్పుడు తొమ్మిది దాటి పది నిముషాలు కూడా అయిపోయింది. పిచ్చి షరతు పెట్టానేమో అన్పించింది. నన్ను నేనే తిట్టుకోసాగాను.

"సారీ.. నేనే ఓడిపోయాను" అని చెబుదామని ఫోన్ చేయబోయి ఆగిపోయాను.

ఎదురుగా...బాబ్జీ!

తలొంచుకుని నిలబడి ఉన్నాడు.

"సారీ! సరితగారు... నేను ఓడిపోయాను. నావల్లకావడంలేదు. మిమ్మల్ని చూడకుండా, మీతో మాట్లాడకుండా ఈ సిటీలో ఉండడం అసాధ్యమనిపించింది. నా సెల్‌లో మీ నెంబర్ తొలగించగలిగానుగానీ ఇక్కడే ఉండి మిమ్మల్ని చూడకుండా, మాట్లాడకుండా ఉండలేనని తెలుసుకున్నాను. అందుకే మా ఊరు వెళ్లిపోతున్నాను. క్షమించండి..." అని కదలబోయాడు.

ఇక నన్ను నేను తమాయించుకోలేకపోయాను.

"బాబ్జీ! నా కండిషన్ ఏదైనా ప్రేమ విషయంలో మీరే గెలిచారు. ఓడి గెలిచారు. యస్! ఈ వారంరోజులూ మీరు కనుక నన్ను చూడకుండా ఉండగలిగితే ఇలాగే మిగతా రోజులూ నేను లేకుండా జీవించగలరు కదా అని మిమ్మల్ని, మీ ప్రేమని తిరస్కరించేదాన్నేమో! కానీ మీ ప్రేమ ముందు ఈ నాన్సెన్స్ కండిషన్ వెలవెలబోయింది. అందుకే అందరూ తమ జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఎవరికో ఒకరికి చెప్పాలని, చెప్పించుకోవాలని ఎదురుచూసే ఆ మూడు మాటలు నేనూ చెప్తున్నాను ఐ లవ్ యూ'" చెప్పి నాకు తెలియకుండానే ఏడ్చేసాను.

ఆ తరువాత తెలిసింది ఇన్నాళ్లకు నా ఎడారి వంటి జీవితంలోనూ ప్రేమ కురిసిందేనన్న ఆనందంతో జారిన ఆనందభాష్పాలు అవి అని.

★